క్లుప్తంగా

స్పర్శలేని మచ్చలు ఉంటే వైద్యులను సంప్రదించండి

తెనాలిఅర్బన్: చర్మంపై రాగి వర్ణం గల స్పర్శలేని మచ్చలు ఉన్నట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జంగం శ్యామ్ సూచించారు. కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠు వ్యాధిపై అపోహలు విడాలన్నారు. కుష్ఠు వచ్చిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి, ఉపాధ్యాయులు జె.రమేష్, వెలగా సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పావనికి ఐఎంఏ అవార్డు

తెనాలిరూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పావనిప్రియాంక ప్రతిష్టాత్మక ఐఎంఏ ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డు అందుకున్నారు. ఈ నెల 23వ తేదీన జరిగిన ఐఎంఏ జాతీయ సమావేశంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరత్ అగర్వాల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఐఎంఏ తెనాలి శాఖ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ మధుప్రభాకర్‌బాబు సమావేశంలో ఉన్నారు. డాక్టర్ పావని అవార్డు అందుకోవడంపై ఐఎంఏ సభ్యులు అభినందనలు తెలిపారు.

పురస్కారానికి రచయిత్రి సుజాత ఎంపిక

పాత గుంటూరు: గుంటూరుకు చెందిన రచయిత్రి ఏవీకే సుజాత ఒంగోలు కళా మిత్ర సంస్థ వారి రాష్ట్రస్థాయి ప్రతి భా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 26న ఒంగోలులో జరగనున్న కార్యక్రమంలో ఆమె పురస్కారాన్ని అందుకోనున్నారు. అమృత హృదయం, వ్యాస సుమా లు, నవ్యాంధ్ర నానీలు, బాలల కవితలు పుస్తకాలను ఆమె రాశారు. నవ్యాంధ్ర రచయితల సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో సుజాత వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రముఖులు, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందారు. ఆమె పురస్కారానికి ఎంపిక కావడంపై నవ్యాంధ్ర రచయితల సంఘ జిల్లా అధ్యక్షురాలు వేదాల విజయలక్ష్మి, సభ్యులు దుర్గాదేవి, లావణ్య, సీహెచ్. ఝాన్సీ, నాగసాయి అభినందనలు తెలిపారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. రాజశేఖర్

తెనాలిరూరల్: డిసెంబర్ 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. రాజశేఖర్ పోలీసులకు సూచించారు. పోలీసుల అధికారులతో తన చాంబర్‌లో శనివారం ఆయన సమావేశమయ్యారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నింటినీ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, రూరల్ సీఐలు కె. చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు, ఎస్. రమేష్‌బాబు, కె. శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ ఫార్మసీ వారోత్సవాలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో రవిశంకర్‌రెడ్డి, అధ్యాపక బృందం

తెనాలి: ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ), ముంబయి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ, ఐపీఏ స్టూడెంట్ ఫోరం సంయుక్త నిర్వహణలో స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజీలో గత వారంరోజులుగా జరిగిన 62వ జాతీయ ఫార్మా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్‌రెడ్డి హాజరయ్యారు. రోగి భద్రతలో ఫార్మసీ విద్యార్థుల ప్రాముఖ్యతను వివరించారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ తమన ప్రసంగంలో జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో 11 రకాల ఈవెంట్స్‌ను నిర్వహించినట్టు చెప్పారు. ఈ-పోస్టర్ ప్రజంటేషన్, పేషెంట్ కౌన్సెలింగ్, బ్లడ్ డొనేషన్, అవేర్‌నెస్ ప్రోగ్రాం, మెడికల్ క్యాంప్ వంటి ఈవెంట్లలో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ రవిశంకర్ రెడ్డి చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కాలేజీలో ఎన్ఎస్ఎస్-2 విభాగాన్ని రవిశంకర్ రెడ్డి ప్రారంభించారు. ఐపీఏ ఏఎస్ఎన్ చాప్టర్ మెంటార్ వై.ఫణికృష్ణ, ఎన్ఎస్ఎస్ టీం కో-ఆర్డినేటర్స్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ జ్యోతిబసు, స్టూడెంట్ ఫోరం ప్రెసిడెంట్ సునీల్‌కుమార్, ఎడిటర్ షాలేంరాజు, ట్రేసర్ వెంకటప్రసాద్, సభ్యులు సుష్మ, గీత, కీర్తి, హిమజ, సుప్రియ, రోహిత్, దిలీప్, బీఫార్మసీ, ఫార్మా-డి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి

ఎంపీడీవో వి.విజయలక్ష్మి



తూములూరులో ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో విజయలక్ష్మి, ఏపీఎం ప్రియదర్శిని

తూములూరు(కొల్లిపర): సమాజంలో స్త్రీలు, బాలికల పట్ల జరుతున్న హింస, వేధింపుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ముందుకు వచ్చి తమ వంతు కృషి అందించాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. శనివారం అంతర్జాతీయ స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏపీఎం ప్రియదర్శిని ఆధ్వర్యంలో మండలంలోని తూములూరు గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు, డ్వాక్రా మహిళలకు లింగ వివక్షతపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్త్రీలు, బాలికల పట్ల శారీరక, మానసికంగా ఏ రూపంలో దాడి జరిగినా అది వారి పట్ల హింసేనని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రులు మగ పిల్లలు ఏవిధంగా చదివిస్తున్నారు అదే విధంగా ఆడపిల్లలను కూడా చదివించి, ధైర్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. మగ పిల్లలకు చిన్ననాటినుండి ఆడపిల్లలను గౌరవించటం గురించి తెలియజేయాలన్నారు. ఏపీఎం ప్రియదర్శిని మాట్లాడుతూ సమాజంలో పరిస్థితులు తమకు వ్యతిరేకంగా ఉన్నా కూడా స్త్రీలు తమ స్వాభిమానాన్ని విడవకుండా సాధికరతతో పరిస్థితులను అధిగమించాలన్నారు. సఖి కేంద్రం ద్వారా బాధిత మహిళలకు సత్వర సహాయం అందించడం జరుగుతుందని,దిశ యాప్, మహిళా హెల్ప్‌లైన్ నంబర్స్ 100, 181, 1098 , 101 నెంబర్ లు ప్రతి మహిళ గుర్తుపెట్టుకొని అత్యవసరమైన సమయంలో నెంబర్ డైల్ చేయటం ద్వారా అత్యవసరమైన సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధనరెడ్డి, ఎంపీటీసీ మండల పరిషత్ పరిపాలన ఏవో చంద్రమోహన్, డ్వాక్రా మహిళలు, సీసీలు, వీఓఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంతో మహిళలకు అదనపు ఆదాయం



ఎరుకలపూడిలో రైతులు, మహిళా సంఘాల సభ్యలతో మాట్లాడుతున్న రామారావు

తెనాలిరూరల్: ప్రతి మహిళా ప్రకృతి వ్యవసాయం ద్వారా తమ ఆదాయాన్ని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని రైతు సాధికార సంస్థ సీఈవో బి. రామారావు ఐఏఎస్ (రిటైర్డ్) సూచించారు. తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయదారులతో ఆయన శనివారం మాట్లాడారు. గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం గ్రామ మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో మహిళలు అదనపు ఆదాయం పొందవచ్చని చెప్పారు. గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ముళ్ళపూడి రంగయ్య అనుసరిస్తున్న విధానం, అతని పొలంలో వచ్చిన మార్పులు, ఆదాయ వ్యయాల లో, దిగుబడి, నేల ఆరోగ్యంలో వచ్చిన మార్పుల అడిగి తెలుసుకున్నారు. సంఘ సభ్యురాలు తాడిబోయిన విజయలక్ష్మి ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో గట్లపై వేసిన 32 రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మొక్కలు, తీగ జాతులను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు ప్రకృతి వ్యవసాయంలో చేపడుతున్నటువంటి కార్యక్రమాలను చూసి రంగయ్య, విజయలక్ష్మిలను ఆయన అభినందించారు. అనంతరం పలు మహిళా సంఘాలతో రామారావు సమావేశమై వారికి పకృతి వ్యవసాయం గురించి సూచనలు చేశారు. అక్కడి నుండి నంది వెలుగు స్వచ్ఛ ఆహార మార్టును సందర్శించారు. ఆయన వెంట ఏవో వెంకట్రావు, డీఎల్ఎంపీ సత్య నారాయణ, వెలుగు సీసీ సుబ్బారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

సైన్స్ పరిశోధనలతోనే దేశ పురోగతి



ప్రొఫెసర్ కరీంకు పట్టా అందజేస్తున్న చాన్స్‌లర్ డాక్టర్ కోనేరు సత్యనారాయణ

మంగళగిరి: సైన్స్ పరిశోధనలతోనే దేశ పురోగతి సాధ్యమని ప్రపంచ సైన్స్ అకాడమీ అధ్యక్షురాలు, ప్రొఫెసర్ క్వరైషా అబ్దుల్ కరీం అన్నారు. నగర పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం శనివారం ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ క్వరైషా మాట్లాడుతూ కోవిడ్-19 ఇప్పటికీ మనతోనే కలసి ప్రయాణం చేస్తోందని, అది ప్రపంచ వ్యాప్తంగా మానవావళి పరస్పర అనుబంధాన్ని దెబ్బతీసిందని తెలిపారు. అదే సమయంలో సైన్స్ పరంగా ఒకరితో మరొకరు కలసి భాగస్వామ్యంలో పనిచేయడానికి పురిగొల్పిందని చెప్పారు. సంవత్సరం కంటే తక్కువ వ్యవధిలో ఆరు సమర్థమైన వ్యాక్సిన్ల అభివృద్ధికి శాస్త్రవేత్తలు కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. భయం, అనిశ్చితి, ఆతృత నుంచి ప్రజలు ఆశలోకి వెళ్లడానికి వ్యాక్సిన్ దోహదపడ్డాయని పేర్కొన్నారు. అయితే, వ్యాక్సిన్లు కనుగొనడంలో లేదా తయారు చేయడంలో భాగస్వాములు కాని దేశాలకు కోవిడ్ పెను సవాల్‌గా మారిందని తెలిపారు. వ్యాక్సిన్ కలిగి ఉన్న దేశాల వ్యవహార శైలి వైరస్ బలంగా మారలా తయారు చేసిందని చెప్పారు. టీకాలు వేసుకున్న కొంతమంది వ్యక్తులు అనుభవించే అసంబద్ధమైన దీర్ఘకాలిక పరిణామాల నుంచి తాము అనేక కొత్త విషయాలు నేర్చుకుంటున్నామని తెలిపారు. స్నాతకోత్సవం సందర్భంగా 4465 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, 38 మందికి బంగారు పతకాలు, 41 మందికి రజిత పతకాలు అందజేశారు. గౌరవ అతిథు డాక్టర్ సి.ఎస్.ఆర్. రావు, అతిథి ప్రొఫెసర్ జి.యు. కులకర్ణి, సినీ నటుడు మురళీమోహన్‌కు చాన్సలర్ కోనేరు సత్యనారాయణ డాక్టరేట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కార్యదర్శి కోనేరు కాంచనలత, వీసీ డాక్టర్ జి. పార్థసారథివర్మ పాల్గొన్నారు.

తెనాలిలో ప్రారంభమైన క్రిస్మస్ సందడి

పలు చర్చిల్లో ప్రతిరోజు ప్రత్యేక ప్రార్థనలు



మారీసుపేట రెండు గేట్ల మధ్యలో రోడ్డుపై ఏర్పాటు చేసిన నక్షత్రం

తెనాలిఅర్బన్: క్రిస్మస్ సందడి తెనాలి పట్టణంలో ప్రారంభమైనది. శనివారం తెల్లవారు జాము నుంచి పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. వచ్చే 25 తేదీ వరకు వీటిని నిర్వహించనున్నారు. అలాగే క్రీస్తు పుట్టుకకు గుర్తుగా భావించే నక్షత్రాలను పట్టణంలోని పలు కూడళ్ల శుక్రవారం అర్ధరాత్రే ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాల్లో భారీ నక్షత్రాలను ఏర్పాటు చేసి యువకులు సందడి చేశారు. క్రైస్తవులందరూ ఈ నెల రోజులు ఉదయం, సాయంత్రం ప్రార్థనల్లో పాల్గొననున్నారు.

లలిత కళా ఉత్సవ పోటీలు ప్రారంభం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్‌లో శనివారం లలిత కళా ఉత్సవంలో భాగంగా మొదటి విడత రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కవిత, కథ, లేఖారచనతో పాటు మధ్యాహ్నం చిత్రలేఖన పోటీల్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 35 పాఠశాలల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్. మంగాదేవి తెలిపారు. విద్య అంటే పుస్తక పరిజ్ఞానం ఒకటే కాదని, కళలు సైతం అందులో ఒక భాగమేనని చెప్పారు. బాలల్లోని సృజనాత్మకతను వ్యక్తీకరించేందుకు, మానసికోల్లాసానికి లలిత కళలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. బాల్య దశ నుంచే కళలపై ఆసక్తి కలిగించినట్లయితే బాలలు సున్నిత భావాలతో ఎదిగి, విలువలను అలవర్చుకొని మంచి పౌరులుగా సమాజంలో నిలబడగలుగుతారని వివరించారు. డిసెంబరు 10న సంగీతోత్సవంలో భాగంగా బాలలకు గాత్రం, వాద్యం, బృందగాన పోటీలు నిర్వహిస్తామని, అదే రోజు సాయంత్రం లలిత కళా ఉత్సవంలో రచయితలకు పురస్కారాలు, రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని ఆమె వెల్లడించారు.

30న అందుబాటులో మైనార్టీ కమిషన్ సభ్యులు

మంగళగిరి: నగరంలోని గౌతమ బుద్ధా రోడ్డులోని ఈద్గా ఎదురుగా ఉన్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ కార్యాలయంలో ఈ నెల 30న సభ్యులు అందుబాటులో ఉంటారని ఆ కమిషన్ స్టేట్ చైర్మన్ డాక్టర్ కె. ఇక్బాల్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పారసీలంతా తమ సమస్యలు, ఫిర్యాదుల్ని కమిషన్‌కు రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవచ్చని సూచించారు. కమిషన్ సేవల్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

జీజీహెచ్‌లో ఆరోగ్యమిత్రలకు బయోమెట్రిక్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో పనిచేసే ఆరోగ్య మిత్రలకు డిసెంబర్ 1 నుంచి ఎఫ్ఆర్ఎస్, బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలోని జగనన్న ఆరోగ్య సురక్ష సమాచార కేంద్రానికి వచ్చే రోగులకు ఆరోగ్య మిత్రలు సేవలు అందించే విషయంలో అలసత్వం వహిస్తున్నారన్న ఆరోపణలపై స్పందించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బయోమెట్రిక్ హాజరు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

జగనన్న గోరుముద్ద మెనూ విధిగా పాటించాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న గోరుముద్ద మెనూ విధిగా పాటించి, విద్యార్థులకు బలవర్థకమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం ఉపాధ్యాయులకు సూచించారు. ఏటీ అగ్రహారంలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కోటేశ్వరరావు

పట్నంబజారు: విద్యార్థుల్ని తరలిస్తున్న ఆటోల్ని శనివారం నగర ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ సీఐ కోటేశ్వరరావు, వెస్ట్ సబ్ డివిజన్ సీఐ కె.శ్రీనివాసరావు నేతృత్వంలో నగరంలోని ముఖ్య కూడళ్లలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. అనుమతులకు మించి తరలిస్తున్న వాహనాల్ని నిలువరించి, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్ 7వ లైనులో నివసించే బి.ప్రభుకిశోర్ రెండు రోజుల కిందట ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గోకులం సిగ్నేచర్ జ్యూవెలర్స్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న అన్నాబత్తుని పుష్ప-ఎమ్మెల్యే శివకుమార్ దంపతులు

తెనాలి: వెండి, బంగారు ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన తెనాలిలో సరికొత్త వెండి, బంగారు ఆభరణాల దుకాణం వచ్చింది. 'గోకులం' సిగ్నేచర్ జ్యూవెలర్స్ పేరుతో స్థానిక కొత్తపేటలోని టీబీ రోడ్డులో ఏర్పాటుచేసిన అధునాతన నగల షోరూం ప్రారంభోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. అన్నాబత్తుని పుష్ప-ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ దంపతులు గోకులం జ్యూవెలరీ షోరూంను ప్రారంభించారు. తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్ శ్యాంప్రసాద్ జ్యోతిని వెలిగించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ క్యాష్ కౌంటర్‌ను ప్రారంభించారు. హైదరాబాద్‌లోని చక్రసిద్ధ్ క్యూర్ ఫర్ ఇన్‌క్యూరబుల్స్ డాక్టర్ భువనగిరి సత్యసింధూజ తొలి కొనుగోలు చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం పాలకవర్గ కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాల్, కార్యదర్శి బూర్లె నరసింహారావు, వైకుంఠపురం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు, డాక్టర్ కడియాల వెంకటరమణ, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు అందజేశారు. పొత్తూరి వీరరాఘవయ్య, పీవీ సుబ్బారావు, లలిత పర్యవేక్షించారు.

వాలీబాల్ పోటీల్లో జేఎంజేకు ప్రథమస్థానం



ప్రథమ స్థానం పొందిన టీం సభ్యులతో కరస్పాండెంట్ థెరిస్సామ్మ, వైస్ ప్రిన్సిపల్ శారద

తెనాలిఅర్బన్: జేఎంజే కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర జిల్లాల మహిళా వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల్లో ప్రథమ స్థానాన్ని తెనాలి జేఎంజే కళాశాల టీం, రెండోవ స్థానాన్ని ఒంగోలుకు చెందిన డీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల టీం, మూడో స్థానాన్ని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కైవసం చేసుకున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.అరుణ సుజాత తెలిపారు. వీరికి ట్రోఫీని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సామ్మ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ మేరి శారద, పలువురు ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తెనాలి వాసికి డాక్టరేట్



తెనాలి రూరల్: పట్టణానికి చెందిన బిట్రా హేమ చంద్రర రావు డాక్టరేట్‌ను పొందారు. కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 13వ స్నాతకోత్సవం పురస్కరించుకుని శనివారం తెలుగు చలన చిత్ర నటుడు మురళీ మోహన్, జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైన్స్, రీసెర్చ్ సెంటర్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కులకర్ణి చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నారు. భౌతిక శాస్త్రంలో ''లో-టెంపరేజర్ డై ఎలక్ట్రిక్ స్టడీ ఆఫ్ కార్బన్ అండ్ మాంగనీస్ డోపెడ్ కాపర్ ఆక్సైడ్' అనే అంశంపై హేమ చంద్రరరావు పరిశోధన జరిపారు. ఆయనకు గైడ్‌గా భౌతికశాస్త్ర విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు వ్యవహరించారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.